ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5


లింగసుగూరులో న్యాయవాదిపై దాడి

రాయచూరు, ఫిబ్రవరి 25 : జిల్లాలోని లింగసుగూరు పట్టణంలో ఆదివా రం ఉదయం బైక్ పై వెళుతున్న స్థానిక న్యాయవాది బసవరాజ్ చలవాదిపై కొంత మంది దుండగులు దాడి చేశారు. బైక్‌పై వెళుతున్న బసవరాజ్‌ను చుట్టుము ట్టిన నలుగురైదుగురు వాగ్వాదానికి దిగడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించడం మొదలుపెట్టారు. దీంతో ఆయన వారిని ఎదుర్కొనే ప్రయత్నం చేసేలోగా దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానికులు జోక్యం చేసు కుని ఆయనవారి బారినుంచి రక్షించి ఆస్పత్రికి తరలించారు. లింగసుగూరు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- ప్రపంచ దేశాలకు ఆదర్శం
- రాజ్యాంగ మార్పునకు బీజేపీ కుట్ర
- జాతీయ ఐక్యతా సదస్సు ముగింపులో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచదేశాలన్నింటి పాలనా విధానాలు, రాజ్యాంగాల్లోని అత్యుత్తమైన సారాం శాన్ని సేకరించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మన రాజ్యాం గాన్ని రూపకల్పన చేశారని, దానిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తె లిపారు. ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో అందరూ మెచ్చినది మన రాజ్యాంగమని కొనియాడారు. రాజ్యాంగం, జాతీయ ఐక్యతా సదస్సు ముగింపు సమావేశం ఆదివారం నగరం లోని ప్యాలెస్ మైదానంలో నిర్వహించారు. కాంగ్రెస్ అధ్య క్షుడు మల్లికార్జున ఖర్గే, ఇండియా కూటమి ముఖ్యులు ఫరూక్ అబ్దుల్లా, సీతారాం ఏచూరి, డి. రాజా, కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, పరిష త్ సభాపతి బసవరాజ్ హొరట్టి, న్యాయశాఖ మంత్రి హెచ్ కే పాటిల్ తోపాటు 18 పార్టీలకు చెందిన 40 మందికిపైగా ప్రముఖ నేతలు భాగస్వామ్యులయ్యారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సభకు మంత్రి డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప అధ్యక్షత వహించారు. సీఎం సిద్దరా మయ్య మాట్లాడుతూ బుద్ధ, బసవ, వచన క్రాంతి కు వెంపు, నారాయణగురు, వివేకానంద వంటి ప్రముఖుల ఆశయాలకు అనుగుణంగా రాజ్యాంగ రూపకల్పన సాగింద న్నారు. రాజ్యాంగం ద్వారా దేశంలోని ప్రతిపౌరుడు స్వతం త్రంగా జీవించే వీలుందన్నారు. ప్రతి మనిషికి సమానమైన హ క్కులు రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. తారతమ్యాలు లేని విధానాలు రాజ్యాంగం ద్వారానే దేశ ప్రజలు పొందుతున్నారని అన్నారు. మన రాజ్యాంగాన్ని ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేబినెట్‌లో మంత్రిగా కొనసా గిన అనంతకుమార్ హెగ్డే తాము అధికారంలోకి వచ్చిందే రాజ్యాంగాన్ని మార్పు చేయడానికని ప్రకటించారని తెలిపారు. ఈ అంశంపై ప్రధాని మోదీగానీ, అమిత్‌షా గానీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు చెందినవారు ఎవరూ ఖండించ లేదని, వ్యతిరేకించలేదని అన్నారు. దీన్నిబట్టి బీజేపీ, ఆర్ఎ స్ఎస్ అజెండా ఉద్దేశ్యాన్ని అనంతకుమార్ హెగ్డే ద్వారా చెప్పించారని వివరించారు. ఈ విషయమై దేశమంతటా చైతన్యం అవసరమన్నారు. దేశంలో శ్రమించేవారి హక్కులు, రైతులు, కార్మికులు మహిళల అస్థిత్వానికి రక్షణ కల్పిస్తున్నది రాజ్యాంగమన్నారు. రాజ్యాంగం మార్పు జరి గితే ఈ వర్గాలు మళ్లీ బానిసలుగా మారాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం లేకుంటే శూద్ర, దళిత వర్గాలు బానిస కార్మికులుగా ఎలా పనిచేసేవారో అర్థం చేసుకోవాలన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలందరికీ రాజ్యాంగం గురించి చైతన్యం తీసుకురావాలనే నెల రోజులపాటు రాష్ట్రమంతటా కార్యక్రమాలు జరిపామన్నారు. సమావేశానికి జాతీయ నేతలు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో


వేదికపై ముఖ్యనేతలు మల్లికార్జున ఖర్గే, డి.రాజా, సిద్దరామయ్య, ఫరూక్ అబ్దుల్లా, సీతారాం ఏచూరి తదితరులు

మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ప్రతి వ్యక్తి చివరి రక్తపు బొట్టు దాకా రాజ్యాంగం కోసం పోరాడాలన్నారు. తమది గ్యారెంటీ ప్రభుత్వమని, మీది ఏమిటంటూ ప్రశ్నించారు. మోదీ గ్యారెంటీ అంటారని, అయితే అది నియంతృత్వం అ వుతుందని, ప్రజలంతా చైతన్యం కావాలన్నారు. రాజ్యాంగం గురించి ఇంటింటా చైతన్యం తీసుకురావాలన్నారు. దేశంలో సమానమైన హక్కులు అందరూ పొందుతున్నారంటే అది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా మాట్లాడుతూ స్వేచ్ఛగా, నిష్ప క్షపాతంగా ఎన్నికలు జరిగేలా కమిషన్ చర్యలు తీ సుకోవాలన్నారు. సీపీఎం నేత సీతారాం ఏచూరి మాట్లాడు తూ ఆర్ఎస్ఎస్ ఊహించిన విధంగా భారత లౌకిక ప్రజా స్వామ్య స్థానంలో ఫాసిస్ట్ హిందుత్వ దేశాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ యోచిస్తోందన్నారు. దేశంలో కులాలు, మతాల అణచివేతను మరింతగా పెంచే మనుస్మృతిని కోరు కుంటున్నారని మండిపడ్డారు. రాజ్యాంగం ద్వారా హక్కు లను పొందుతున్న మనమంతా వాటి రక్షణకోసం కూడా నడుం బిగించాలన్నారు.


పురవీధులలో రథోత్సవం

ఘనంగా వెంకటరమణస్వామి రథోత్సవం

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 25: తాలూకాలోని పురాణ ప్రసిద్ధ తలకాయలబెట్టలోని వెంకటరమణస్వామి బ్రహ్మ రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. భూనీలా సమేత లక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయంలో మూడు రోజులుగా విశేషపూజలు కొనసాగాయి. ఆలయాన్ని విశేష పుష్పాలంకరణ చేశారు. స్వామివారికి విశేష పూజలు, అలంకరణ, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవ మూర్తిని అలంకరించిన రథంపై కొలువుదీర్చగా రథోత్సవాన్ని తహసీల్దార్ బీఎన్ స్వామి లాంఛనంగా ప్రారంభించారు. పురవీధులలో రథం ఊరేగగా భక్తులు రథంపై అరటిపండ్లు, దవనం వేసి మొక్కులు తీర్చుకున్నారు. చిక్కబళ్లాపుర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, కోలారు ఎంపీ మునిస్వామి, నియోజకవర్గ ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్, కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ, బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ, ఆనందగౌడ, సమాజ సేవకుడు అంజినప్ప, ముఖ్యులు రాయప్పనహళ్లి అశ్వత్థ నారాయ ణరెడ్డి, డీపీ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు. జాతరలో భాగంగా బొరుగులు, బత్తాసు, జిలేబి, మైసూర్ పాక్, చెరుకురసం, పిల్లల ఆటపాటల సామగ్రి తదితర దుకాణాలు ఏర్పాటయ్యాయి. భక్తులకు ఆలయ వ్యవస్థాపనా సమితి సహా అనేకమంది దాతలు అన్నసంతర్పణ, ప్రసాద వినియోగం చేశారు.


ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి సుధాకర్ తదితరులు

సురపుర ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక కన్నుమూత

- ఎమ్మెల్యే మృతికి సీఎం, డీసీఎం సహా ప్రముఖుల సంతాపం

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యాదగిరి జిల్లా సురపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక (67) గుండెపోటుతో కన్నుమూ శారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 20రోజులుగా బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికి త్సలు పొందుతూ ఆదివారం ఉదయం తుదిశ్వాస వీడారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సురపుర నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో కర్ణాటక కాంగ్రెస్ పార్టీ నుంచి తొలిసారి విజయం సాధిం చారు. 1999, 2013, 2023లో వరుసగా కాంగ్రెస్ నుంచి విజయం నమోదు చేశారు. ఇయన ఇటీవలే రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. రాజా వెంకటప్ప నాయక మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపం తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి సిద్దరామయ్య నగరంలోని మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి పార్థివదే హాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తర్వాత డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు కేబినెట్ మంత్రులు పలువురు పార్థివదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జున ఖర్గే ఓ లేఖ ద్వారా సంతాపాన్ని తెలిపారు. మంత్రులు ప్రియాంక ఖర్గే, శివానంద పాటిల్‌తోపాటు పలువురు సంతాపం తెలిపారు.


రాజా వెంకటప్ప నాయక (ఫైల్)

స్పీకర్, మంత్రుల సంతాపం

ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక పట్ల స్పీకర్ యూటీ ఖాదర్, కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలతోపాటు మాజీ ప్రధాని దేవెగౌడ, మాజీ సీఎంలు యడి యూరప్ప, బసవరాజ్ బొమ్మై, కుమార స్వామి సహా వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంగా ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అత్యంత ఆప్తుడైన కూటమిలో కొనసాగారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయనపై ఒత్తిడి కూడా ఉండేది. ఇటీవల రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మ న్‌గా బాధ్యతలు తీసుకున్నారు. కిడ్నీలో రాళ్లు ఉండడంతో వారం క్రితం ఆపరేషన్ చేయించుకున్నారు. కోలుకుంటుం డగానే గుండెపోటు రావడంతో తుదిశ్వాస వీడారు. రాజా వెంకటప్ప నాయక నైతిక విలువలు కల్గిన రాజకీయ నాయ కుడనే పేరొందారు. యాదగిరిలో సోమవారం అంత్యక్రి యలు జరపనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సుర పుర ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక అకాల మృతిపట్ల సీఎం సిద్దరామయ్య ప్రగాఢ సంతా పాన్ని వ్యక్తం చేశారు. మణిపాల్ ఆసుపత్రిలో పార్థివదేహాన్ని సం దర్శించాక మీడియాతో మాట్లా డారు. రెండు దశాబ్దాలకుపైగా వెంకటప్పనాయకతో పరిచయం ఉందన్నారు. ఎప్పుడు కలిసినా నియోజకవర్గ అభివృద్ధి విషయమే చర్చించేవారన్నారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అన్నారు.


రాజా వెంకటప్ప నాయక పార్థివదేహానికి సీఎం తదితరుల శ్రద్ధాంజలి

హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా జస్టిస్ నిలయ్ విపిన్‌చంద్ర ప్రమాణం

- సీఎం సహా ప్రముఖుల హాజరు

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ నిలయ్ విపిన్‌చంద్ర అంజారియ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ఆది వారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనను హైకోర్టు సీజేగా ఇటీవల నియమించారు. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న ఆయనను సుప్రీంకోర్టు కొలీజియం ఈనెల ప్రారం భంలో సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్ర చూడ్ నేతృత్వంలోని కొలీజియం ఎన్‌వీ అంజారియను కర్ణాటక సీజేగా నియమిం చింది. ప్రస్తుత సీజే జస్టిస్ పీఎస్ దినేశ్‌కుమార్ ఆదివారంతో పదవీవిరమణ పొందుతున్నారు. ఆయన 24 రోజులపాటు హైకోర్టు చీఫ్‌జస్టిస్‌గా వ్యవహరించారు. రాష్ట్ర హైకోర్టులో ఇటీవల కొన్నేళ్లుగా అత్యంత తక్కువకాలం సీజేగా వ్యవహరించిన వారిగా నిలిచారు. అంజారియ 2011 నవంబరులో గుజరాత్ హైకోర్టు న్యాయమూ ర్తిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి అక్కడే వివిధ హోదాలలో కొనసాగారు. సివిల్, కంపెనీ లా, రాజ్యాంగబద్ధ, కార్మిక, సర్వీస్ విభాగాల్లో అధ్యయనం చేశారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రమాణస్వీకారంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, న్యాయ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్, పరిషత్ సభాపతి బసవరాజ్ హొరట్టి, కేంద్ర మాజీ మంత్రి వీరప్పమొయిలీ తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న జస్టిస్ నిలయ్ విపిన్‌చంద్ర

డీసీఎం డిన్నర్‌కు ముఖ్యుల దూరం



- లోక్‌సభ టిక్కెట్లపై కాంగ్రెస్‌లో అసంతృప్తి


బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్పష్టమైన మెజారిటీతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం, డీసీఎం ఎవరికివారు ప్రాబల్యం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఒకవేదికపై ఆశీనులైనప్పుడు మాత్రమే అభిమానం, మిత్రులుగా కనిపిస్తారు కానీ వారి విధానాల్లోనూ మార్పు లేదనే విమర్శలు ఉన్నాయి. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ శుక్రవారం ఆహ్వానించిన విందుకు పలువురు మంత్రులు గైర్హాజరైన విషయం తీవ్రమైన చర్చకు దారితీ స్తోంది. రాష్ట్రంలోని 28 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎక్కువ స్థానాలు గెలుపొం దేందుకు పార్టీ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే డీకే శివకుమార్ మంత్రులతో నియోజకవర్గాల వారిగా చర్చించేందుకు విందుకు ఆహ్వానిం చారు. కీలకమైన మైసూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప గైర్హాజర య్యారు. ఇటీవలే ఆయన సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకు మార్ ఇద్దరూ లోక్‌సభ ఎన్నికలకు మంచి అభ్యర్థులు అవుతారని, వారిని రంగంలోకి దించాలని బహిరంగంగానే ప్రకటించారు. ఈ అంశం వివాదాస్పదమైంది. ఇక సహకారశాఖ మంత్రి, హాసన్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కేఎన్ రాజణ్ణ కూడా విందుకు దూరంగా ఉన్నారు. అధిష్ఠానం లేదు ఎవరూ లేదు... మమ్మల్ని బానిసలుగా చూడరాదని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఇక బైరతి సురేశ్, సీఎం సిద్దరామయ్యకు ఆప్తుడనే విషయం తెలిసిందే. సంతోష్ లాడ్, శరణబసప్ప దర్శనాపురతోపాటు మరికొందరు గైర్హాజరైనట్లు తెలుస్తోంది. హోంశాఖ మంత్రి, సీనియర్ నేత పరమేశ్వర్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ అభ్యర్థుల జాబితా త్వర లోనే ప్రకటిస్తామని, ఇందుకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయన్నారు. స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల జాబితాకై ఓ విడత చర్చలు ముగిశాయన్నారు. మరోసారి సమావేశమై తుది జాబితాను రూపొందించి పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీకి పంపుతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మంత్రులు పోటీ చేసే విషయమై అధిష్ఠానమే తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర

దొడ్డబళ్లాపుర, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చాక అభివృద్ధి కానరావడం లేదని, ఏ నియోజ కవర్గానికి కూడా ఎమ్మెల్యే గ్రాంట్లు అందడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర మండిపడ్డారు. ఆది వారం తాలూకాలోని చిక్కమధురెలో గ్రామ చలో అభి యాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని సీఎం తన భుజాన్ని తానే తట్టు కుంటున్నారని విమర్శించారు. ఢిల్లీ చలో ద్వారా కేంద్రంపై పోరాటానికి దిగారని మండిపడ్డారు. గ్యారెంటీ పథకాల పేరిట కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, వీటి ప్రయోజనాలు 20శాతం ప్రజలకు కూడా అందడం లేద న్నారు. నిత్యావసరాల ధరలతో ప్రజలు బెంబేలెత్తుతున్నా రని, కరువు పరిహారం రైతులకు అందక విలవిలలాడుతు న్నారన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో సాగిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ మరోసారి ప్రధాని కావాలని ఆకాం క్షించారు. ఇందుకు కార్యకర్తలు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 28 లోక్‌సభ నియోజకవర్గా ల్లోనూ బీజేపీ విజయానికి పాటుపడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే బూత్ స్థాయిలో 10 శాతం ఓట్లను పెంచుకునే లక్ష్యం కల్గినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని, అదే విధంగా రాష్ట్ర వైఫల్యాలను తెలియచేయాలని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కార్య క్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే ధీరజ్, యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్, నగరసభ బీజేపీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గ్రామ చలో అభియానలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.25	1,606.74
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	763	8,525
సామర్థ్యం (టీఎంసీలు)	8.89	31.59

హంపీకి పోటీగా గుడేకోటే ఉత్సవాలు

కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్

హొసపేట, ఫిబ్రవరి 25: హంపీ ఉత్సవాలకు పోటీగా కన్నడ సాంస్కృతిక శాఖ, బెంగళూరు, విజయనగర జిల్లా యంత్రాంగాల సహకారంతో గుడేకోటే ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గుడేకోటే లోని ఒనకే ఓబవ్వ వేదిక వద్ద ఎమ్మెల్యే శ్రీనివాస్ ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను చెప్పినట్లుగా ప్రజలు ఉత్సవాలను ఆదరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గుడేకోటే ఉత్సవ్‌ను రికార్డు స్థాయిలో నిర్వహిస్తామని తెలియజేశామని, అందుకు తగ్గట్టుగానే ఉత్సవాలను ప్రారంభించామన్నారు. ఈ ప్రాంత ప్రజల ప్రేమను ఎప్పటికీ మరువలేమని, గుడేకోటే అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ.3 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడేకోటేలోని పిల్లలు చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నదే తన కోరిక అన్నారు. విజయనగరం కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ గుడేకోటే ఉత్సవం హంపి ఉత్సవాన్ని తలపించే విధంగా జరగడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు ఎమ్మెల్యేల కృషి అభినందనీయమన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన మంజమ్మ జోగతి మాట్లాడుతూ గుడేకోటే ఉత్సవ్‌ను డాక్టర్ శ్రీనివాస్ ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. ఈసందర్భంగా మాజీ ఎంపి ఉగ్రప్ప, జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి సదాశివ ప్రభు, ఎస్పీ హరిబాబు, అదనపు జిల్లాకలెక్టర్ అనురాధ, సబ్ డివిజన్ సంచాలకులు సిద్దలింగేష్ రంగన్నవర్, తహసీల్దార్ రాజు, కూడ్లిగి హిరేమఠం సంస్థానం గురువు ప్రశాంత్ సాగర్ శివాచార్య స్వామి, ఒనకే ఓబవ్వ వంశస్థుడు రాజన్న, పాళెగార వంశస్థుడు శివరాజవర్మ, గ్రామపంచాయితీ అధికారులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో కళాబృందాలు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

ఘనంగా యల్లమ్మదేవి రథోత్సవం

సిరుగుప్ప, ఫిబ్రవరి 25 : అంగరంగ వైభవంగా యల్లమ్మదేవి మహా రథోత్సవం ఆదివారం జరిగింది. సిరుగుప్ప తాలుకాలోని ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో వెలసిన రారావి యల్లమ్మదేవి జాతర సందర్భంగా మహా రథోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఆలయం నుంచి ఎదురుబసవన్న కట్ట వరకు భక్తులు రథాన్ని లాగారు. పూలు, పండ్లు విసిరి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసారు.



మహారథోత్సవ దృశ్యం

రథోత్సవంలో అపశృతి

కోటేమల్లేశ్వర తేరుకు విరిగిన బేరింగ్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 25: కోటే మల్లేశ్వర స్వామి తేరు బేరింగ్ విరిగిపోవడంతో రథోత్సవం సగం దారిలోనే నిలిచిపోయింది. ఈ సంవత్సరం శనివారం మడితేరు లాగారు. సాయంకాలం రథోత్సవం జయజయ ఘోష జల మధ్య ప్రారంభమైంది. తేరు పెద్దమార్కెట్ నీలకంఠ దేవాలయం దగ్గరకు రాగానే స్టీరింగ్ బేరింగ్ విరిగిపోవడంతో అక్కడే ఆగిపోయింది. తేరును అక్కడే విడిచి దేవుని విగ్రహాన్ని ఉత్సవంగా తీసుకుని పోయి ధార్మిక విధి విధానాలను పూర్తి చేశారు. ఆదివారం తేరు మరమ్మతులు పూర్తిచేసి యథాస్థానానికి తీసుకొచ్చారు.

701 మంది మహిళలకు ఒడి నింపిన గోశాల నాగరాజుస్వామి



గోశాల నాగరాజుస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 25 : తాలుకాలోని జాలిబెంచి గ్రామంలో గోశాల నాగరాజుస్వామి నేతృత్వంలో 701 మంది మహిళలకు ఒడినింపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా బళ్లారి కనకదుర్గమ్మ ఆలయం నుండి జాలిబెంచి గ్రామం వరకు డోలు డప్పువాయిద్యాలతో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్న వీరశివాచార్య మహాస్వామి వల్లూరు, శివయోగి శివాచార్య మహాస్వామి, సిద్దరాంపురం నంజుండేశ్వరస్వామి, ధరూరు కొత్తూరు మరి దేవరు, సోమ సముద్రం, వీరభద్రయ్య స్వామి, గ్రామ పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు భద్రయ్య స్వామి, గ్రామ పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, గ్రామ పంచాయతీ సర్వీస్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ రాములమ్మ కుంభోత్సవం



ప్రత్యేకాలంకరణలో రాములమ్మదేవి

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 25 : బళ్లారి నగరం బండేటి సమీపంలో శ్రీరాములమ్మ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారికి బండెట్టి గ్రామ ప్రజలు ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు, కార్పొరేటర్లు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇస్లామ్.. శాంతికి ప్రతీక

సిరుగుప్ప, ఫిబ్రవరి 25 : ఇస్లాం ధర్మం శాంతి మార్గానికి ప్రతిరూపమని తహసీల్దార్ షంషాలం అభిప్రాయం వ్యక్తం చేశారు. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా అన్ని మసీదులలోను, దర్గాల్లోనూ పెద్దల పండుగను పురస్కరించుకుని అన్ని చోట్ల నమాజ్ చేస్తామని ఈ ప్రార్థనల్లో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. నమాజు చేయడం వల్ల మనిషికి శాంతి, మానసిక ప్రశాంతత లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఈద్ మిలాద్ కమిటీ, పదాధికారులు, ముస్లింలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ఓటమికి కాంగ్రెస్సే కారణం

గంగావతి రూరల్, ఫిబ్రవరి 25: 2023 ఎమ్మెల్యే ఎలక్షన్లో తాను ఓడిపోవడానికి కాంగ్రెస్ నాయకులే కారణమని గంగావతి మాజీ ఎమ్మెల్యే ఇక్బాల్ అన్సారీ అన్నారు. ముస్లిం నాయకుడు గెలువ రాదని గంగావతిలో ఉన్న నాయకులు, లీడర్లు అందరూ కలిసి పద్మవ్యూహం లాంటి వలవేసి తనను అపజయం పాలు చేశారన్నారు. తన అపజయానికి కాంగ్రెస్ నాయకులు కారణమని తెలుసునని, రాబోయే గంగావతిలో ప్రతి ఇంటికి వెళ్ళి తన అపజయానికి కారణం వీరే అని తెలియజేస్తానన్నారు.

ప్రజాసమస్యలపై ఎస్‌యూసీఐ సంతకాల సేకరణ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 25: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎస్‌యూసీఐ కమ్యూనిస్టు పార్టీ ఆదివారం నగరంలోని కౌల్‌బజార్‌లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈసందర్భంగా ఎస్‌యూసీఐ జిల్లాకమిటీ సభ్యులు మంజుళ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76ఏళ్ళు గడుస్తున్నా ప్రజలు ఎన్నో ఎన్నికలు, పార్టీల పాలన చూశారని, ప్రతిసారీ నిరాశే ఎదురవుతున్నదన్నారు. 'అచ్చే డే హామితో ' అధికారంలోకి వచ్చిన మోది ప్రభుత్వం ప్రజలకు నరకయాతన మాత్రమే మిగిల్చిందన్నారు. విద్య, ఆరోగ్య రంగాలతో సహా అనేక ప్రభుత్వ రంగాలు తమ ప్రధాన సేవకులుగా పనిచేస్తున్న కార్పోరేట్ యజమానుల చేతుల్లో ఉన్నాయన్నారు. లక్షలాది ఖాళీలను భర్తీ చేయడం లేదని, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయన్నారు. కేవలం ఎన్నికల భ్రమల్లో కూరుకుపోకుండా ప్రజలు నిజానిజాలు గ్రహించి బలమైన పోరాటానికి సిద్ధం కావాలన్నారు. అనంతరం ఎస్‌యూసీఐ కమ్యూనిస్టు పార్టీ మరో జిల్లా కమిటీ సభ్యుడు ఏ.దేవదాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా హామీల మూలధనంపైనే నడుస్తోందన్నారు. రాష్ట్రం కరువు పరిస్థితులను ఎదుర్కొంటుందని, నరేగా పథకం సక్రమంగా అమలు కావడం లేదని, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఆశా వర్కర్లకు సరైన జీతాలు అందడం లేదన్నారు. ఇలాంటి అనేక సమస్యలపై బళ్లారిలో 28న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టనున్నామన్నారు. సోషలిస్టు సమాజాన్ని తీసుకురావడానికి పీడిత ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌యూసీఐ పార్టీ సభ్యురాలు ఏ.శాంత మాట్లాడారు. ఈసందర్భంగా సంస్థ ఆఫీస్ బేరర్లు సురేశ్, గురల్లిరాజా,రవికిరణ్, ఈరన్న, అనుపమ, ఉమ, ప్రమోద్ ప్రజలు పాల్గొన్నారు.



సంతకాలను సేకరిస్తున్న ఎస్‌యూసీఐ కార్యకర్తలు

ఘనంగా స్కౌట్స్ దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 25: స్కౌట్స్‌అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బేడన్ పావెల్ జయంతిని ఆదివారం సండూరులోని ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పిల్లల కోసం పాత్ మూవ్‌మెంట్, వ్యాసరచన పోటీలు, గాలిపటం తయారుచేయడం. స్కౌట్స్ క్లబ్ విద్యార్థులకు చర్చ, జానపదనృత్యం, క్రాఫ్ట్ ,రంగోలి తదితర పోటీలు నిర్వహించారు. ఉదయం నగరంలో కవాతు చేశారు. సండూరులో పలు సర్కిల్స్ గుండా శోభయాత్ర నిర్వహించారు. వ్యవస్థాపకుడు జీతూ సేట్, క్షేత్ర శిక్షణాధికారి అక్కి, స్కౌట్స్ అండ్ గైడ్ జిల్లా సంస్థ ఉపాధ్యక్షులు నాగనగౌడ విద్యాసంస్థ కార్యదర్శి జగదీశ్, బసాపూర్ మాట్లాడారు. ఈనేపథ్యంలో ఎస్‌కేఎంఈ గనుల శాఖ ముఖ్యకార్యదర్శి జోషి జయన్న, తాలూకా కార్యదర్శి సోమప్ప కోశాధికారి మహ్మద్ జావిద్,ప్రధానోపాధ్యాయుడు కొట్రేశ్, కల్లయ్యహిరేమఠ్, సునితా దివాకర్,రాఘవేంద్ర, లోకేశ్, నాగరాజు, రమేశ్, నాగవేణి, జయశ్రీ, జ్యోతి ఎర్రిస్వామి, సిస్టర్ అలిన్ స్కౌట్స్ గౌడ్స్ క్లబ్ శిక్షకులు పాల్గొన్నారు. ఈ సమారంభంలో 450మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలో గెలుపొందిన విజేతలందరికీ బహుమానాలు పంపిణీ చేశారు.

వైభవంగా సేవాలాల్ జయంతి

కంప్లి, ఫిబ్రవరి 25 : సేవాలాల్ 885వ జయంతిని కంప్లి తాలుకాలోని హళ్లళ్లి తాండాలో ఆదివారం బంజారా సమాజం వారు ఘనంగా నిర్వహించారు. ఉదయం తాండాలో సేవాలాల్ భావ చిత్రపటాన్ని తమ సమాజం దుస్తులతో, కలశాలతో భాజాభజంత్రీల నడుమ ఊరేగించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బంజారా పీఠం స్వాములు శ్రీకుమార్ మహారాజ్ హేమగిరి శివప్రకాష్ మహారాజ్ స్వామి, శివప్ప పూజారి, ఎమ్మెల్యే జేఎన్ గణేష్, లింగప్ప జాదవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్ని సమాజాలతో పాటు బంజారా సమాజం కూడా అన్ని రంగాల్లో ముందడుగు వేస్తూ గుర్తింపు పొందుతోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారమే హామీలను నెరవేర్చుకున్నామన్నారు. మున్ముందు కూడా హళ్లళ్లి తాండాలో ఇళ్ల పట్టాలు లేని వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చి తమ వంతుగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు రామచంద్రప్ప, అధ్యక్షులు శ్రీనివాసరాథోడ్, లింగప్ప జాదవ్, హనుమంతప్ప, బసవరాజు, దేవరాజు, చెన్నప్ప, మూకయ్యస్వామి, శ్రీనివాసరావు, బంజారా సమాజం పదాధికారులు పాల్గొన్నారు.



హళ్లళ్లి తాండాలో సేవాలాల్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

రెయిన్‌బోలో మరిన్ని సదుపాయాలు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, ఫిబ్రవరి 25 : పట్టణంలోని సన్నాపురం రోడ్డులో చాంద్ బాషా ఎడ్యుకేషన్ ట్రస్టు నిర్మించిన రెయిన్‌బో ఇంటర్మీడియట్ కళాశాలలో సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ కోరారు. ఆదివారం కళాశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కంప్లి నుంచి పొరుగు పట్టణాలకు ఎంతో మంది చదువుల కోసం వెళుతుండటంతో అదే పట్టణానికి చెందిన చాంద్ బాషా తానే ముందుకొచ్చి అన్ని సౌకర్యాలు వుండే నూతన కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్కరు పదవ తరగతి అనంతరం ఈ కళాశాల సదుపాయాలను పొందాలని కోరారు. అలాగే ఈ కళాశాలలో పేద కుటుంబాలకు అనుగుణంగా ఫీజుల చెల్లింపులు వుంటాయన్నారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు హజరత్ సయ్యద్ అబ్దుల్ హుస్సేన్ ఖాద్రి, ట్రస్టు అధ్యక్షులు షారుక్, కార్యదర్శి చాంద్ బాషా, మహబూబ్ బాషా, రిహానా, ఖాజావలీ, హేమయ్య స్వామి, మూకయ్యస్వామి, బట్ట ప్రసాద్, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మేత లేక ఇబ్బంది పడుతున్న గొర్రెలు, మేకలు



ఎండవేడిమి నుంచి రక్షణకు చెట్ల నీడకు చేరుకున్న గొర్రెలు, మేకలు

కంప్లి, ఫిబ్రవరి 25 : ఈ వేసవిలో మూగజీవులు వర్షాభావంతో అడవుల్లో మేతదొరకక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అడవుల్లో, కొండల్లో ఎండవేడిమితో చెట్లన్నీ ఎండిపోయాయి. మరో వైపు డ్యామ్‌లో నీరు లేకపోవడంతో కాలువల్లో నీరు రాక ఎక్కడ చూసినా భూములు ఖాళీగానే వుండిపోయాయి. మేకలు, గొర్రెలకు పచ్చని గడ్డి, ఆకులు, అలములు దొరకక ఇబ్బందులు పడుతున్నాయి. దీనికి తోడు రోజు రోజుకు ఎండవేడిమి పెరుగుతుండటంతో మేతకోసం అడవికి వెళ్లేందుకు కూడా మూగజీవులు ఇబ్బంది పడుతున్నాయి. ఈ యేడాది మేకలు, గొర్రెల కాపరులు మేత లేక వాటిని మార్కెట్లకు తరలిస్తున్నారు. మూగజీవులకు పూర్తిగా కష్టాలు ఎదురయ్యాయని కాపరులు దేవసముద్రం వెంకటేష్, షుగర్‌ఫ్యాక్టరీ లక్ష్మణ్‌లు తెలిపారు.

ఘనంగా అట్టుకల్ పొంగల్ వేడుక

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 25: నగరంలోని హొస్పేట్‌రోడ్డు ఏసుమక్కల తాయమ్మదేవి ఆలయం ముందు కేరళీయులు అట్టుకుల్ పొంగల్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేరళ మలయాళం అసోషియేషన్, కర్ణాటక లాయర్ స్విస్ సొసైటీ(కేఎన్‌ఎస్‌ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పొంగల్ పండుగ వేడుకను ఘనంగా నిర్వహించినట్టు కార్యదర్శి శశాంకన్ తెలిపారు. మట్టికుండలో పొంగల్ చేసి అట్టుకల్ దేవికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా కేరళ సమాజ ప్రముఖులు శివదాస్‌నాయర్, గోపినాథ్‌నాయర్, బాబురాజు, సికే. బిజు,ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మట్టికుండలో పొంగల్ వండుతున్న కేరళ మహిళలు

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కంప్లి, ఫిబ్రవరి 25 : కంప్లి తాలుకాలోని ఎమ్మిగనూరు గ్రామంలో పురాతన కాలం నాటి అభయాంజనేయ స్వామి ఆలయానికి ప్రజలు జీర్ణోద్ధరణ చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే మహిళలు కోలాటాలతో ఆకట్టుకున్నారు. ఆంజనేయస్వామి ఊరేగింపు కార్యక్రమంలో గాలి జనార్దన్ రెడ్డి సతీమణి గాలి లక్ష్మీ అరుణ పాల్గొని కోలాటమాడారు. అలాగే ఎమ్మెల్యే గణేష్ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రి శ్రీరాములు స్వామివారి పూజల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో పాల్గొన్న భక్తాదులకు అన్నప్రసాదాలు ఏర్పాటుచేశారు. మూడు రోజుల పాటు ఆంజనేయస్వామి ఆలయంలో వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామి మహిళా మండలి, ఆంజనేయస్వామి సమితి సభ్యులు, గ్రామ ప్రముఖులు ఎన్నో సేవలు చేపట్టారు.



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

హోసూరు జోన్

ఉత్సాహంగా మారథాన్



మారథాన్‌లో పాల్గొన్న యువత

హోసూరు, ఫిబ్రవరి 25: హోసూరు టేబుల్ 87, హోసూరు లేడీస్ సర్కిల్ 32, రోటరీ క్లబ్ ఆఫ్ హోసూరు, డిస్ట్రిక్ట్ రోటరాక్ట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయస్థాయి 7 కి.మీ మారథాన్ హోసూరులో ఆదివారం జరిగింది. విద్యాభివృద్ధి లక్ష్యంగా నిధుల సేకరణకోసం ఈ మారథాన్ నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. చిన్నారులు సహా పెద్దలు కూడా 3వేలమందికిపైగా మారథాన్‌లో భాగస్వాములయ్యారు. 5-13, 14-18, 19-49, 40ఏళ్ల పైబడిన కేటగిరీలలో మారథాన్ సాగింది. పాఠశాల, కళాశాల విద్యార్థులు, పురుషులు, మహిళలు సీనియర్ సిటిజన్లతో సహా 3 వేలమంది ఇందులో పాల్గొన్నారు. అప్పావు నగర్ ఔటర్ రింగ్‌రోడ్డు, ప్రభుత్వాసుపత్రి మీదుగా సాగిన మారథాన్ వేదిక వద్దకు చేరింది. న్యూ ఏఎస్‌టీసీ హడ్కో పరిధిలో 100ఫీట్ రోడ్డు వద్ద జరిగిన మారథాన్‌ను కృష్ణగిరి పార్లమెంట్ సభ్యుడు చెల్లకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఏడు కిలోమీటర్ల పరుగుల మారథాన్‌లో కర్ణాటక రాష్ట్రం బెళగావికి చెందిన వైభవ్ (19) ప్రథమస్థానంలో నిలిచి రూ.10వేల నగదు బహుమతి కైవసం చేసుకున్నాడు. మారథాన్‌లో మేయర్ సత్య, శ్రీనివాసమూర్తి, సబ్ కలెక్టర్ ప్రియాంక పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రత్యంగిరాదేవి ఆలయంలో విశేషపూజలు

హోసూరు, ఫిబ్రవరి 25: హోసూరు మోర్నపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రాహుకేతు సమేత శ్రీ మహా ప్రత్యంగిరా దేవి ఆలయంలో మాఘ మాస పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం రాత్రి విశేషపూజలు నిర్వహించారు. రాహు కేతువులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అదే విధంగా మూలవిరాట్టు ప్రత్యంగిరా దేవికి ఉదయం ప్రత్యేక అభిషేకాలతో పూజలు, మంగళ హారతులు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. ఎండుమిరపకాయలు వేస్తూ హోమం చేయడం విశేషం. ఈ సందర్భంగా అమ్మవారికి సహస్రనామార్చన జరిగింది. విశేషపూజల్లో తమిళనాడు నుంచే కాక కర్ణాటక, ఆంధ్ర నుంచి కూడా భక్తాదులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా తిమ్మరాయస్వామి రథోత్సవం

హోసూరు, ఫిబ్రవరి 25: బాగలూరు సమీపానగల గుడిసెట్లు గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత తిమ్మరాయస్వామి ఆలయ రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత తిమ్మరాయస్వామి ఉత్సవాలు వారంరోజులుగా సాగుతున్నాయి. ఆదివారంతో ఉత్సవాలు ముగిశాయి. తొలుత ఉత్సవమూర్తులను వివిధ పుష్పాలతో అలంకరించి రథంపై కొలువుదీర్చారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథం కదిలింది. రథోత్సవంలో ఆలయ కమిటీ నిర్వాహకులు చొక్కనాథ రాజు, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రథోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యేప్రకాశ్ హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన రథోత్సవంలో బాగలూరు, బేరిక్లై, గుడిసెట్లు, హోసూరునుంచి వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్

ఆటో-బైక్ ఢీ : వ్యక్తి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

రాయచూరు, ఫిబ్రవరి 25 : జిల్లాలోని లింగసుగూరు తాలూకా హట్టి హోసూరు క్రాస్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఎదురుగా వస్తున్న ఆటో-బైక్‌లు ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. శివరాజ్(30), ఉమాదేవి(27) ఇద్దరు బైక్ పై హట్టిహోసూరు నుంచి సిరవార వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటో వీరిని ఢీ కొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న శివరాజ్ అక్కడికక్కడే మృత్యువాతపడగా వెనక కూర్చున్న ఉమాదేవికి తీవ్ర గాయాలయ్యాయి. వీరితో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తికి కూడా తీవ్రంగా గాయాలు కావడంతో చికిత్స కోసం వారిద్దరిని ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన హట్టి పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రయాణీకురాలి బ్యాగులో బంగారు గొలుసు చోరీ!

రాయచూరు, ఫిబ్రవరి 25 : బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణీకురాలి బ్యాగులో నుంచి 50 గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురి కాగా ఆ బస్సును ఏకంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి మొత్తం తనిఖీ చేశారు. ఈ సంఘటన ఆదివారం ఉదయం జిల్లాలోని దేవదుర్గ తాలూకా జాలహళ్ళి పోలీస్ స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. దేవదుర్గకు చెందిన మహిళ తింథిణి వైపు వెళ్లె బస్సులో ప్రయాణిస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. బ్యాగులో ఉంచిన బంగారు గొలుసు దొంగతనం జరిగినట్లు గుర్తించిన మహిళ కేకలు వేస్తూ బస్సు ఆపాలని గొలుసు పోయిందని గొడవ చేయడంతో డ్రైవర్ ఏకంగా బస్సును పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకెళ్లాడు. దీంతో పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని బస్సులో ప్రయాణికులందరి లగేజిని తనిఖీ చేయగా ఎవరి దగ్గర గొలుసు లభించలేదు. కాగా గొలుసు దొంగలించిన దొంగ అప్పటికే బస్సు దిగి వెళ్లి పోయి ఉండవచ్చని అంచనా వేసిన పోలీసులు బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించారు.



ప్రయాణీకుల బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

ఎలకా వేణుగోపాలరావు (పుట్టినరోజు)



ఎలకా వేణుగోపాలరావు 1982 ఫిబ్రవరి 26న విశాఖపట్నంలో జన్మించారు. భారత జాతీయ క్రికెట్ జట్టుకు ప్రాతినిథ్యం వహించారు. కుడి చేయి బ్యాటింగ్, ఆఫ్ స్పిన్ బౌలింగ్ శైలితో రాణించారు. అలాగే రంజీలలో ఆంధ్ర క్రికెట్ జట్టులో 121 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 7081 పరుగులతో యావరేజ్ 40.93 రన్‌రేట్‌గా నిలిచారు. 17 సెంచరీలు, 30 హాఫ్‌సెంచరీలు చేశారు. వన్డే ఇంటర్నేషనల్ క్రికెట్‌లో దేశంలో తొలి 'సూపర్ సబ్'గా గుర్తింపు పొందారు. ఐపీఎల్‌లో డెక్కన్ చార్జర్స్, ఢిల్లీ డేర్ డెవిల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుల తరపున ఆడారు. 2017లో క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు.

బజరంగ్ పూనియా (పుట్టినరోజు)



రెజ్లింగ్ క్రీడాకారుడిగా రాణించిన బజరంగ్ పూనియా 1994 ఫిబ్రవరి 26న హర్యానా రాష్ట్రం ఝూఝర్ జిల్లా ఖుదాన్ ప్రాంతంలో జన్మించారు. 2013 నుంచి 2019 వరకు వరల్డ్ చాంపియన్‌షిప్స్ పోటీలలో 60 నుంచి 65 కిలోల విభాగంలో కాంస్య, రజత పతకాలు సహా ఇతర స్థానాలలో నిలిచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఫ్రీస్టైల్ రెజ్లింగ్‌లో సాధనలకు అర్జున అవార్డు, రాజీవ్‌గాంధీ ఖేల్ రత్న ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. 2020లో ఫిక్కీ ఇండియా స్పోర్ట్స్ అవార్డు, 2021లో పద్మశ్రీ పొందారు. 2022లో బర్మింగ్‌హామ్ కామన్‌వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించారు. ఇతర యూనివర్సిటీలనుంచి గౌరవాలు అందుకున్నారు. ప్రస్తుతం రైల్వే శాఖలో గెజిటెడ్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు.

కాళేశ్వరరావు (వర్ధంతి)



అయ్యదేవర కాళేశ్వరరావు 1881 జనవరి 22న కృష్ణా జిల్లా నందిగామలో జన్మించారు. మహాత్మాగాంధీ నాయకత్వంలోని అన్ని ఉద్యమాలు, స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొని కారాగార శిక్ష అనుభవించారు. ప్రజా ప్రతినిధిగా ఆయన విజయవాడ పురపాలక సంఘానికి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఎంతోమందికి విద్యాదానం చేశారు. రాజగోపాలాచారి నేతృత్వంలో ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం ఏర్పడినప్పుడు మద్యపాన నిషేధ చట్టం, సేల్స్‌ట్యాక్స్, హరిజన దేవాలయ ప్రవేశ చట్టాల రూపకల్పనలో కాళేశ్వరరావు కీలకంగా వ్యవహరించి అందరి ప్రశంసలు పొందారు. 1955లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయవాడ నియోజకవర్గం నుంచి ఎన్నికై తొలి స్పీకర్‌గా వ్యవహరించారు. గ్రంథాల ప్రచురణలోనూ శ్రద్ధ వహించారు. 1962 ఫిబ్రవరి 26న కన్నుమూశారు.

వాయువ్య ఆర్టీసీలో డిజిటల్ పేమెంట్స్



కండక్టర్ మెడలోని ట్యాగ్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న ప్రయాణికుడు

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల్లో డిజిటల్ పేమెంట్స్‌కు శ్రీకారం చుట్టారు. ఆగ్నేయ ఆర్టీసీలో ఇప్పటికే డిజిటల్ చెల్లింపుల ద్వారా టిక్కెట్లు కొనుగోలు చేసే విధానం అమలులోకి తెచ్చారు. ప్రస్తుతం వాయువ్య విభాగం కార్పొరేషన్‌లో దాదాపు అన్ని సర్వీసుల్లోనూ ఫోన్‌పే ఆధారిత స్వీకరిస్తున్నారు. కండక్టర్లు క్యూ ఆర్ కోడ్ ట్యాగ్‌ను మెడలో వేసుకుంటున్నారు. ప్రయాణాన్ని బట్టి ధర నిర్ణయిస్తే డిజిటల్ పేమెంట్ చేసిన వెంటనే టిక్కెట్ ఇస్తున్నారు. ఐదు డిపోల పరిధిలో 415 బస్సులలో ప్రయోగాత్మకంగా జరిపిన డిజిటల్ చెల్లింపులు విజయవంతమయ్యాయి. 2023 సెప్టెంబరు నుంచి ఐదు డిపోలలో ప్రారంభించగా నవంబరు నాటికి మరిన్ని డిపోలు చేరాయి. రూ. 2.30 కోట్లు నేరుగా వాయువ్య రవాణా విభాగం బ్యాంకు ఖాతాకు జమ అవుతుండేది. ప్రస్తుతం కిత్తూరు కర్ణాటక పరిధిలోని ఆరు జిల్లాల్లోనూ విస్తరింపచేసి 4581 బస్సు సర్వీసులల్లోనూ అమలు చేయనున్నారు. త్వరలోనే కేఎస్‌ఆర్టీసీలోనూ డిజిటల్ పేమెంట్లను అమలు చేస్తారు. ప్రస్తుతం కేఎస్‌ఆర్టీసీలో 8343, బీఎంటీసీలో 6222, వాయువ్య రవాణా విభాగంలో 4,857, కల్యాణ కర్ణాటక పరిధిలో 4854 బస్సు సర్వీసులు ఉన్నాయి. దశలవారీగా డిపోలవారీగా డిజిటల్ పేమెంట్స్‌ను అమలు చేయనున్నారు.

రాజ్యాంగ చైతన్య రథయాత్రలో తుమకూరుకు మొదటి స్థానం

పావగడ, ఫిబ్రవరి 25: వారం రోజుల నుంచి కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రాజ్యాంగ చైతన్యరథయాత్రకు సంబంధించి కర్ణాటకలోని 30 జిల్లాల్లో తుమకూరు జిల్లాకు మొదటి స్థానం లభించింది. జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రథయాత్ర కొనసాగి విజయవంతం చేసేందుకు కారకులైన ప్రతి సామాజిక వర్గానికి చెందిన నాయకులకు, అధికారులకు సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి ప్రభుత్వం తరపున అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ శుభకల్యాణి, జిల్లా పంచాయతీ సీఈఎస్ ప్రభుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతుల మీదుగా రూ.లక్ష చెక్కును అందజేశారు.

దొంగకు దేహశుద్ధి

లేపాక్షి, ఫిబ్రవరి 25 : మండల లోని మామిడిమాకులపల్లిలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఒకడు ఓ ఇంట్లో జొరబడి దొంగతనానికి పాల్పడ్డాడు. అయితే కుటుంబ సభ్యులు గమనించి కేకలు వేయగా గ్రామస్థులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి లేపాక్షి పోలీసులకు అప్పజెప్పారు. స్థానిక పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మండల వ్యాప్తంగా దొంగల హల్‌చల్ అధికమైందని పోలీసులు కట్టడి చేయాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు అంటున్నారు.

మహనీయుల సందేశాలు అనుసరణీయం



పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే మంజులా లింబావళి తదితరులు

మహదేవపుర, ఫిబ్రవరి 25: మహాపురుషులు కేవలం ఒక సామాజికవర్గానికి పరిమితం కాకుండా సమాజంలోని ప్రజలందరికి ఆదర్శప్రాయులుగా ఉంటారని, మహనీయుల సందేశాలు నేటికీ అనుసరణీయమని ఎమ్మెల్యే మంజులా అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. నియోజక వర్గంలోని దొడ్డకన్నల్లిలోని వేమన క్రీడామైదానంలో ఆదివారం ఏర్పాటైన మహాయోగి వేమన, హేమరెడ్డి మల్లమ్మ జయంతిని పురస్కరించుకుని మాజీ మంత్రి అరవింద లింబావళి, రాజ్యసభ మాజీ సభ్యుడు కేసీ రామమూర్తి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి, ఎమ్మెల్సీ గోపినాథ్‌రెడ్డి తదితరులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి లింబావళి మాట్లాడుతూ తల్లి హేమరెడ్డి మల్లమ్మ, మహాయోగి వేమన, భక్త కనకదాసు, దార్శనికులు బసవణ్ణ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయుల జయంతుల ఉద్దేశ్యం వారి జీవితాల సందేశాలను మనం అలవరచుకుని భావితరాలకు అందించడమేనన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సామరస్యం, పరస్పర విశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సర్వజ్ఞ, తిరువళ్ళువర్ రీతిలో మహాయోగి వేమన కూడా ఆదర్శపురుషులన్నారు. సమాజంలోని మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ ప్రజలను చైతన్యం చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ హోబళి అధ్యక్షుడు మనోహరరెడ్డి, రూరల్ అధ్యక్షుడు బీఎన్ నటరాజ్, కార్యక్రమ నిర్వాహకులు శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యూనియన్‌బ్యాంక్ ఆధ్వర్యంలో మెగా రిటైల్ ఎక్స్‌పో



రిటైల్‌థాన్ 2024 ప్రారంభంలో జనరల్ మేనేజర్ నవనీత్‌కుమార్ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెగా రిటైల్ ఎక్స్‌పో రిటైల్‌థాన్ 2024ను జనరల్ మేనేజర్ నవనీత్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ప్యాలెస్ మైదానంలో శనివారం ఎక్స్‌పోను ప్రారంభించిన జనరల్ మేనేజర్ మాట్లాడుతూ బెంగళూరు నగరంలో యూనియన్ బ్యాంక్ మూడు రీజినల్ కార్యాలయాలు కలిగి ఉందన్నారు. రిటైల్ వ్యాపారులకు అనుకూలంగా ఉండేలా 200కుపైగా శాఖలు ఉన్నాయన్నారు. హౌసింగ్, ఆటోమొబైల్, ఎడ్యుకేషన్ రంగాలకు సంబంధించి రుణాల అవసరాలకోసం ప్రయత్నించేవారికి ఒకే వేదిక ద్వారా పరిష్కరించాలని ఎక్స్‌పోను ఏర్పాటు చేశామన్నారు. మెగా ఈవెంట్‌లో ప్రముఖ రియల్టర్, హౌసింగ్ డెవలపర్స్ 45 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారని, ఆటోమొబైల్ డీలర్స్, ఎడ్యుకేషన్ కన్సల్టెంట్, రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్ డీలర్‌లు భాగస్వాములయ్యారన్నారు. ఏ విభాగానికి సంబంధించి రుణం పొందాలన్నా సమగ్ర సమాచారంతోపాటు తగిన సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. రికార్డులు సక్రమంగా ఉంటే ఇప్పటికిప్పుడే రుణమంజూరు పత్రాలను అందిస్తామన్నారు. మెగా ఈవెంట్‌లో వెయ్యి మందికిపైగా సందర్శకులు పాల్గొన్నారు. బ్యాంకు డిప్యూటీ జోనల్ హెడ్ కుమార్ క్యాప్సిమా, డీజీఎం రీజనల్ హెడ్ అసీమ్‌కుమార్ పాల్, డీజీఎం రీజనల్ హెడ్ జ్యోతికృష్ణన్, రాజేంద్ర కుమార్, రాజేశ్‌కుమార్ మిశ్రాతోపాటు బ్యాంకు ఎగ్జిక్యూటివ్ అధికారులు భాగస్వాములయ్యారు.

తరచూ ట్రాఫిక్ ఉల్లంఘనలు

వాహనాలను ధ్వంసం చేసేలా పోలీసుల ప్రతిపాదన

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నిత్యం ట్రాఫిక్ రద్దీతో తలమునకలై పనిచేసే పరిస్థితిలో కొనసాగుతున్న ట్రాఫిక్ పోలీసులకు ఉల్లంఘనలకు పాల్పడేవారు కొత్త సమస్య అవుతున్నారు. నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడేవారి వాహనాలను ధ్వంసం చేయాలనే ప్రతిపాదనను ప్రభుత్వం ముందు ఉంచారు. నగరవ్యాప్తంగా ఉల్లంఘనలకు పాల్పడేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 50శాతం రాయితీతో జరిమానా వసూళ్లను రెండుసార్లు అమలు చేశారు. ఇటువంటి నిబంధనలను ఏమాత్రం పట్టించుకోని కొంతమంది వాహనదారులు ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నారు. రూ.50వేలకుపైగా జరిమానా కల్గిన వాహనాలను ధ్వంసం చేసే అధికారం ఇవ్వాలని తద్వారా రోడ్డుభద్రతకు అనుకూలం కానుందని ట్రాఫిక్ పోలీసు విభాగం ప్రభుత్వానికి ప్రతిపాదన ఉంచింది. నగర పరిధిలో 10సార్లు, ఇతర ప్రాంతాలలో ఐదుసార్లు ఉల్లంఘనలకు పాల్పడితే మోటారు వాహనాల చట్టం సడలించి కఠిన చర్యలు అమలు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్టు అదనపు పోలీస్ కమిషనర్ అలోక్‌కుమార్ తెలిపారు. ఇటీవలే నగరంలో రూ.50వేలకుపైగా జరిమానాలు బకాయి ఉన్న 84బైక్‌లు, ఒక కారును సీజ్ చేశారు. ఈ వాహనాలపై 10,200 కేసులు 1.07 కోట్ల రూపాయల జరిమానా సొమ్ము పెండింగ్‌లో ఉంది. వీరి ఇళ్లకు నోటీసులు పంపి జరిమానా వసూలు చేస్తామని హెచ్చరించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు పలు కఠిన నిబంధనలు అవసరమని, అందులో భాగంగానే వాహనాల ధ్వంసానికి అనుమతులు ఇవ్వాలనే ప్రతిపాదన తెచ్చారు.

ఉత్సాహంగా యమహా వెహికల్ రైడ్



ట్రాక్ డేలో బైకర్స్ ఇలా...

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇండియా యమహా మోటర్ విని యోగదారుల్లో ఉత్సాహం పెంచేలా ట్రాక్ డే ఈవెంట్‌ను నిర్వహించింది. వందమంది యమహా వాహనదారులు, 300మందికిపైగా అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ది కాల్ ఆఫ్ ది కాల్‌లో భాగంగా అరుణిగ్రిడ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు. యమహా మోటర్‌బైక్‌లను ట్రాక్‌పై పలు విన్యాసాలు చేశారు. లీన్ యాంగిల్స్, హైస్పీడ్ కార్నరింగ్, బాడీ మూమెంట్, బ్రేకింగ్ వంటి విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ది కాల్ ఆఫ్ ది బ్లూ ట్రాక్ డే యాక్టివిటీతో యమహా దేశమంతటా ఇటువంటి విన్యాసాలు నిర్వహిస్తోందని నిర్వాహకులు ప్రకటించారు.

కేన్సర్‌పై జాగృతి జాతా



జాతాలో ప్లకార్డులతో విద్యార్థులు తదితరులు

దొడ్డబళ్ళాపుర, ఫిబ్రవరి 25: నవోదయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తాలూకా ఆరోగ్యాధికారి కార్యాలయం, ఆత్రేయ ఆయుర్వేద మహావిద్యాలయం పరిశోధనా కేంద్రం సహకారంతో వరల్డ్ కేన్సర్ డేలో భాగంగా శనివారం పట్టణంలోని ముత్సంద్ర గ్రామంలో జాథా నిర్వహించారు. తల్లీబిడ్డల ఆసుపత్రి ఆవరణలో ముఖ్య పాలనా వైద్యాధికారి డాక్టర్ రమేశ్ జాథాను ప్రారంభించారు. తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ శారద మాట్లాడుతూ చిన్న గాయం లేదా గడ్డ రూపంలో ఉన్న వాటిని ప్రథమదశలో గుర్తిస్తే కేన్సర్ మహమ్మారిని నయం చేయవచ్చునన్నారు. మహిళలు ఎటువంటి భయం లేకుండా చికిత్సలు పొందాలన్నారు. ప్రధానంగా గర్భకోశ, స్తన కేన్సర్ సమస్యలపై జాగృతి కల్పిస్తున్నట్టు తెలిపారు. నవోదయ ట్రస్టు కార్యక్రమ సంయోజకులు జనార్ధన్ మాట్లాడుతూ నేటి యువత ప్రధానంగా గుట్కా, పొగాకు వంటి వ్యసనాలకు లోనైన కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. అంతే కాకుండా గంటల తరబడి మొబైల్ గేమ్స్ వాడకం ద్వారా వాటినుంచి వెలువడే రేడియేషన్ కారణంగా ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. కార్యక్రమంలో నవోదయ ట్రస్టు సంయుక్త కార్యదర్శి కార్తిక్‌గౌడ, న్యాయ సలహాదారుడు మంజునాథ్, లోహిత్, ఆత్రేయ కాలేజ్ డాక్టర్ ఆదిత్య, కొంగాడియప్ప కళాశాల సామాజిక కార్యవిభాగం, ఆత్రేయ కళాశాల వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్థవంతంగా సత్సంగం



సత్సంగం సంచాలకులు వెంకటేశ్ తదితరులు

విజయపుర, ఫిబ్రవరి 25: సత్సంగం వంటి కార్యక్రమాల ద్వారా భగవంతుడి కృపకు దగ్గర కావచ్చునని తద్వారా జన్మను సార్థకతం చేసుకోవచ్చునని శ్రీకృష్ణ సత్సంగ అధ్యక్షుడు జేఎస్ రామచంద్రప్ప అభిప్రాయపడ్డారు. పట్టణంలోని 14వ వార్డులోని మహేశ్వరమ్మదేవి సేవా అభివృద్ధి ట్రస్టు ఆధ్వర్యంలో పున్నమి పూజా కార్యక్రమంలో 'జ్ఞానామృత బాళిగొందు బెళకు' కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. భక్తులు ప్రశాంతంగా, ఉత్తమ జీవనంగా సాగించేందుకు 'సత్సంగం' పేరిట కార్యక్రమాల ద్వారా భగవంతుడిని ఆరాధించడం ద్వారా సంస్కారం పొందడం ద్వారా ఆధ్యాత్మికత భావాలు పెంపొందించుకుని క్రమేపీ పరమాత్మలో లీనం కావచ్చునన్నారు. సత్సంగం సంచాలకులు వీఎన్ వెంకటేశ్ మాట్లాడుతూ ఏడాదికోసారి ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను ముని వెంకటప్ప స్మరణార్థం కువణ్ణ, చంద్రకళ, రాంబాబు నిర్వహించారు. ఇదే సందర్భంగా ప్రతినెలా ఐదుగురు ముత్తైదువులకు చీర సేవ, పేద విద్యార్థులకు నోటు పుస్తకాలను అందచేశారు. కార్యక్రమాన్ని పురసభ సభ్యురాలు రాధమ్మ పీ ప్రకాశ్ ప్రారంభించారు. ఎస్ రమేశ్‌స్వామి, మహేశ్వరమ్మ దేవి సేవా అభివృద్ధి ట్రస్టు అధ్యక్షుడు ఆర్ నాగరాజు, వీఎస్ ప్రకాశ్, ఆర్ గోవిందరాజు, బలిజ సంఘం అధ్యక్షుడు ఆర్ మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీల్లో భారతజట్టుకు రజతపతకం



పతకంతో త్రోబాల్ జట్టు

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇండో గల్ఫ్ ఇంటర్నేషనల్ త్రోబాల్ టోర్నమెంట్ పోటీలలో భారత మహిళా జట్టు రజత పతకం సాధించింది. అమెరికా జట్టు విజేతగా నిలిచినట్టు ప్రకటించారు. ఏడు దేశాలజట్టు పాల్గొన్నాయని ఆరు లీగ్ మ్యాచ్‌లలో భారతజట్టు రాణించినట్టు కేప్టెన్ సంపూర్ణ హెగ్డే తెలిపారు. బహ్రెయిన్ నుంచి పోటీల సమాచారాన్ని ఆమె ప్రకటించారు. సంపూర్ణహెగ్డే బెంగళూరుకు చెందినవారు. కాగా అంతర్జాతీయ స్థాయిలో రాణించడంపై హర్షం వ్యక్తమైంది.

హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లో మారథాన్



మారథాన్‌లో పాల్గొన్న యువత

బొమ్మనహళ్ళి, ఫిబ్రవరి 25: అనాథలు, ఒంటరి పిల్లల సంక్షేమం కోసం మారథాన్ నిర్వహించారు. హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లో మారథాన్ 2024ను ఒనిసా స్వచ్ఛంద సంస్థ ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు రెండు కిలోమీటర్లపాటు సాగింది. ఫౌండేషన్ డైరెక్టర్ నాగసుబ్రమణ్యం మాట్లాడుతూ నగర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మారథాన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనాథల చదువు ఇతర బాగోగులను ఒనిసా స్వచ్ఛంద సంస్థ చూస్తోందన్నారు. ఇలాంటి వారికి చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేకించి క్రీడలపట్ల ఆసక్తి కల్గినవారు ఒలింపిక్స్‌లో పాల్గొనేలా తమవంతు చేయూత ఇవ్వదలిచామన్నారు. మారథాన్‌లో పెద్దసంఖ్యలో యువత పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. కాగా ఆరోగ్య రక్షణకు మారథాన్ వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు వెల్లడించారు. విద్య, క్రీడలను ప్రోత్సహించే మార థాన్‌లకు ప్రజల సహకారం అందించాలని కోరడంపై స్పందన వచ్చిందన్నారు.

మామిడితోటకు నిప్పు.. అపారనష్టం



పంట కాలిపోయిన దృశ్యం ఇలా...

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 25: తాలూకాలోని వై హుణసేనహళ్ళిలో సుమారు ఒకటిన్నర ఎకరాలలో హెచ్‌కే సుబ్బారెడ్డికి చెందిన మామిడితోటకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. 25ఏళ్లకుపైగా ఉన్న మామిడితోటలో 40-45 చెట్లు ఉన్నాయి. మామిడి తోటలో టమోటా పంటకు ఉపయోగించే సుమారు 4వేల కర్రలను కూడా కాల్చేశారు. శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనలో అపారనష్టం వాటిల్లింది. తోటలను నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమకు ప్రభుత్వం ఆదుకోవాలని సుబ్బారెడ్డి, ఆయన కుమారుడు మునేగౌడ కోరారు. ఈమేరకు పోలీసులకు, ఉద్యానశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. పూతదశలో ఉన్న పంటకు నిప్పంటించడంతో అపారనష్టం వాటిల్లిందని, దుండగులను శిక్షించాలని కోరారు.

క్లీన్‌మ్యాక్స్‌తో ఎయిర్‌పోర్ట్ అథారిటీ కీలక ఒప్పందం



ఒప్పందంలో ఇరు సంస్థల ఉన్నతాధికారులు

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు క్లీన్‌మ్యాక్స్‌తో ఎయిర్‌పోర్ట్ అథారిటీ కీలక ఒప్పందం చేసుకుంది. ఆసియాలోనే ముందంజలో ఉండే సీ అండ్ ఐ రెన్యూవబుల్ ఎనర్జీ సంస్థ క్లీన్‌మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్, బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీలు రెండున్నర దశాబ్దాలకోసం కీలక ఒప్పందాన్ని చేసుకున్నాయి. 45.9 మెగావాట్ల సౌరశక్తిని ఉత్పత్తి చేసుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నారు. బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో క్లీన్‌మ్యాక్స్ ఎండీ కులదీప్‌జైన్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ సీఈఓ హరిమారర్‌లు ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. వందశాతం రెన్యూవబుల్ ఎనర్జీ లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రకటించారు.

వడ్డీ రహిత రుణాలపై హర్షం

చేళూరు, ఫిబ్రవరి 25: తాలూకాలోని చిలకలనేర్పు గ్రామ పంచాయతీ పరిధిలోని టీ గొల్లహళ్ళిలో రైతులకు ఇటీవల వడ్డీ రహిత రుణాలు మంజూరు చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ సుధాకర్ పిలుపు మేరకు వీఎస్ఎస్ఎన్ సంస్థ ద్వారా 70మంది రైతులకు రూ.1.15 కోట్లు కేసీసీ రుణాలను మంజూరు చేశారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, సకాలంలో వాపసు చెల్లించాలని మంత్రి సుధాకర్ సూచించారు. కార్యక్రమంలో శిడ్లఘట్ట ఎమ్మెల్యే రవికుమార్, డీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ నాగిరెడ్డి, శివరాం, ఆర్‌టీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీ కొన్న బస్సు ఒకరి మృతి

చింతామణి, ఫిబ్రవరి 25: కేఎస్‌ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీ కొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. చింతామణి-బెంగళూరు మార్గంలోని సంతేకల్లహళ్ళి గేట్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో కోలారు జిల్లా శ్రీనివాసపుర తాలూకా యల్దోరు హోబళి తిన్నలికి చెందిన టీవీ నిశాంత్ (37) మృతి చెందాడు. సంతేకల్లహళ్ళి గేట్ సమీపంలోని పెట్రోల్ బంకులో పెట్రోల్ పట్టించి చింతామణి వైపు వస్తుండగా బెంగళూరు నుంచి చింతామణి వైపు వస్తున్న కేఎస్‌ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీ కొంది. దీంతో బస్సు చక్రం చిక్కుకున్న నిశాంత్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చింతామణి రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ ప్రదీప్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకున్నారు.

ఇంటికోసం గొడవ, దాడి

దొడ్డబళ్ళాపుర, ఫిబ్రవరి 25: ఇల్లు కట్టేందుకు సంబంధించి దళిత ప్రముఖుడు ఓబలేశ్‌పై రాయితో దాడికి పాల్పడ్డారు. దాడికి గురైన వ్యక్తి దొడ్డబళ్ళాపుర ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పట్టణ శివారులోని ముత్తూరులో శుక్రవారంరాత్రి 10 గంటలకు ఘటన చోటు చేసుకుంది. ముత్తూరు గ్రామంలో ఇల్లు కట్టేందుకు సంబంధించి ఓబలేశ్, మునియమ్మ, శ్రీనివాస్, గోవిందల మధ్య గొడవ జరిగింది. ఈ సందర్భంగా ఓబలేశ్‌పై రాయితో దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన మైలార లింగేశ్వరస్వామి ఉత్సవాలు



పురవీధుల్లో ఊరేగుతున్న మైలార లింగేశ్వరస్వామి

అగళి, ఫిబ్రవరి 25 : మండలంలోని మధూడి గ్రామంలో వెలసిన మైలార లింగేశ్వరస్వామి వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. రెండు రోజులుగా జరిగిన ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. చివరి రోజు ఆదివారం ముఖ్య అతిథులుగా చిదానంద భారతి స్వాముల వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ భక్తికి మించిన శక్తి మరొకటి లేదని, భక్తితోనే మనిషికి మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. అదేవిధంగా గురువయ్యల పూజలు, పురవీధుల గుండా స్వామివారిని ఊరేగింపు, మహా మంగళహారతి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మైలార లింగేశ్వరస్వామి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.